క్లుప్తంగా

వాల్తేర్ డీజిల్ లోకోషెడ్‌కు 60 వసంతాలు



డీజిల్ లోకో షెడ్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం డీజిల్ లోకోషెడ్‌కు 60 వసంతాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డీఆర్‌ఎం లలిత్ బోరా ముఖ్య అతిథిగా పాల్గొని లోకోషెడ్ ఇంతగా విస్తరించడంలో కృషి చేసిన సిబ్బందిని కొనియాడారు. దేశంలోనే అతిపెద్ద లోకోషెడ్‌గా విశాఖ డీజిల్ లోకోషెడ్ విస్తరించి ఉందని తెలిపారు. 1965 మే 2న కేవలం 13 లోకోమోటివ్‌ల సామర్థ్యంతో ప్రారంభమైన ఈ షెడ్.. నేడు 450 లోకోమోటివ్‌ల నిర్వహణ సామర్థ్యం స్థాయిని చేరుకుందని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ మెకానికల్ ఇంజినీర్(డీజిల్ లోకోషెడ్) రుద్ర రంజన్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు మెగా ఫాగింగ్

సీతంపేట: దోమల నియంత్రణకు జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 25వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ నిర్వహించారు. సీతంపేట, బీటీఆర్ నగర్, హరిజన వీధి, కనకమ్మ వీధి, గణేష్‌నగర్, గొల్లవీధి, పాత చేపల మార్కెట్, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా హైవే ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది శివ, రాంబాబు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టామని, వారానికి ఒక రోజు డ్రైడే పాటించి నీటి నిల్వలను మార్చడం ద్వారా దోమలు పెరగకుండా చూడొచ్చన్నారు.

మర్యాదపూర్వక కలయిక



డీడీ శ్రీనివాసకుమార్‌ను అభినందిస్తున్న భవాని, వరలక్ష్మి తదితరులు

సీతంపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసకుమార్‌ను శుక్రవారం ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు టి.జి.భవాని, కార్యదర్శి జి.వి.ఎస్.వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎం.ఇందిర, ఈసీ మెంబర్లు గౌరీ, పద్మజ ఆయనకు మొక్కను బహూకరించి అభినందించారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

సీతమ్మధార: శ్రీకాకుళం పాతపట్నానికి చెందిన పి.కిరణ్‌కుమార్ చెన్నైలో బీటెక్ చదువుతున్నాడు. స్వస్థలానికి వచ్చిన ఇతడు ఒడిశాలోని గుణుపూర్‌లో 450 గ్రాముల గంజాయి కొనుగోలు చేశాడు. దీనిని చెన్నై తీసుకెళ్లే క్రమంలో శుక్రవారం రామాటాకీస్ వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సు కోసం వేచి ఉన్నాడు. ఇంతలో టాస్క్‌ఫోర్స్ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్ఐ భరత్ సిబ్బందితో తనిఖీలు చేసి యువకుడిని అరెస్ట్ చేసి, గంజాయి స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ద్వారకా స్టేషన్ సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం (హెచ్‌ఆర్‌ఏఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర్ హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ తెలిపారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

కథల పుస్తకాలు పిలుస్తున్నాయ్ రండి..



ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కొలువుదీరిన వందలాది కథల పుస్తకాలు

- ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పిల్లల కోసం ప్రత్యేక విభాగం
- మూడు వేలకు పైగా తెలుగు, ఇంగ్లిష్ కథల పుస్తకాలు
- చందమామ కథల నుంచి హ్యారీపోటర్ వరకు..
- పిల్లలు కూర్చుని చదువుకోవడానికి అందమైన మియావాకీ సెంటర్
- అందుబాటులో జనరల్ నాలెడ్జి, ఎన్‌సైక్లోపీడియా పుస్తకాలు



మియావాకీ సెంటర్‌లో కథల పుస్తకాలు చదువుకుంటున్న పిల్లలు

- ఒక ఏడాది సభ్యత్వం: రూ.300
- ఏసీ గదిలో కూర్చుని ఏడాది పాటు పుస్తకాలను ఇక్కడ ఉచితంగా చదువుకోవచ్చు.
- రూ.450 చెల్లించి ఇంటికి పుస్తకాలు పట్టుకెళ్లొచ్చు.

సీతంపేట: హలో ఫ్రెండ్స్ నాపేరు కియాన్స్.. 8వ తరగతి చదువుతున్నాను. నా తమ్ముడు పేరు జతిన్. 5వ తరగతి చదువుతున్నాడు. సమ్మర్ హాలీడేస్ కదా ఇంట్లోనే ఉంటున్నాం. ఎండ ఎక్కువగా ఉంటుందని బయటికి ఆడుకోవడానికి వెళ్లనీయడం లేదు. టీవీలో కార్టూన్స్ చూస్తూ, మొబైల్‌లో గేమ్స్ ఆడుతూ గంటల తరబడి గడిపేస్తున్నాం. బోరు కొడుతోంది. ఇది చూసి మా నాన్న గారు ఇలా అయితే కళ్లు పాడవుతాయని.. ఆలోచనా శక్తి మందగిస్తుందన్నారు. మీకు మంచి టైం పాస్, నాలెడ్జి ఇచ్చేలా ఒక చోటుకు తీసుకెళ్తాను రండని ద్వారకానగర్‌లో బీవీకే కళాశాల ఎదురుగా ఉన్న విశాఖ పౌర గ్రంథాలయానికి తీసుకువచ్చారు. చాలా పెద్ద బిల్డింగ్. ఇక్కడ సెల్లార్‌లో, లాన్‌లో చాలా మంది పుస్తకాలు పట్టుకుని చదువుతూ కన్పించారు. రెండవ అంతస్తుకు వెళ్లాం. కుడి చేతి వైపు తిరగ్గానే అందంగా డిజైన్ చేసిన రూమ్ కనిపించింది. లోపలికి వెళ్లాం. పిల్లలు చదువుకోవడానికి మియావాకీ పేరుతో ఆకర్షణీయమైన స్టడీ రూమ్‌ను చూపించారు. మియావాకీ చూశాక చాలా ఆనందం వేసింది. రూమ్ చుట్టూ గోడలకు పచ్చని చెట్లతో రూపొందించిన వాల్ పేపర్, కూర్చోడానికి సోఫాలు, వెరైటీ కుర్చీలు, సరదాగా ఊగుతూ చదివేందుకు ఉయ్యాల మాకు బాగా నచ్చాయి. మాలాంటి స్కూల్ పిల్లలు చైర్లలో కూర్చుని చదువుకుంటున్నారు. ఆసక్తిగా చూసాం. ఏం చదువుతున్నారా అని. కథల పుస్తకాలు చదువుతున్నారు. ఇంతలో చీఫ్ లైబ్రేరియన్ దుర్గారాణి వచ్చారు. మమ్మల్ని చూసి నవ్వుతూ పలకరించారు. మమల్ని పరిచయం చేసుకున్నారు. ఇక్కడ పిల్లలు చదువుకునే తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో 3 వేలకు పైగా పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మాకు చాలా ఆశ్చర్యం చేసింది. వాటి గురించి తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. వెంటనే ఏయే పుస్తకాలున్నాయని చాలా ఆసక్తిగా అడిగాం. పిల్లలు ఎంతో ఇష్టపడే పంచతంత్రం, అక్బర్ బీర్బల్ కథలు, బేతాళ కథలు, జాతక కథలు, తెనాలి రామలింగడి హాస్య కథలు, అమర్ చిత్రకథ, చందమామ కథలు, బాల సాహిత్యం, పిల్లల మాస పత్రికలు బాలబాట, బుజ్జాయి, బాల భారతం, ఇంగ్లిష్‌లో పిల్లలు ఎంతో ఇష్టపడే హ్యారీపోటర్, గూజ్ బమ్స్, గలివర్ ట్రావెల్స్, టెల్ మీ వై, అడ్వంచర్ స్టోరీస్, ఫెస్టివల్స్, టేల్స్ ఆఫ్ దుర్గా, యానిమల్ స్టోరీస్, ఫేమస్ ఫైవ్, 365 స్టోరీస్ అండ్ రైమ్స్, టెర్రిఫిక్ గోస్ట్ స్టోరీస్, టేల్స్ ఆఫ్ గ్రేట్ సిటీస్ పుస్తకాలను మాకు చూపించారు. అలాగే విజ్ఞానాన్ని అందించే జనరల్ నాలెడ్జి, చిల్డ్రన్ ఎన్‌సైక్లోపిడియా, యానిమల్ ఎన్‌సైక్లో పిడియా, నిఘంటువులు, హ్యూమన్ బాడీ, చిల్డ్రన్ నాలెడ్జి బ్యాంకు, బుక్ ఆఫ్ కొశ్చన్స్ అండ్ ఆన్సర్స్, సైన్స్ ప్రాజెక్ట్స్, ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చాలా ఉన్నాయని ఒక్కో బుక్ చూపించారు. కథల పుస్తకాలు, ఎన్‌సైక్లోపిడియా వంటి పుస్తకాలు చూడగానే మాకు చాలా ఆనందం వేసింది. వెంటనే నేను, నా తమ్ముడు నచ్చిన పుస్తకాలు ఎంచుకున్నాం. ఈ వేసవి సెలవుల్లో ఈ పుస్తకాలన్నీ చదివేయాలన్నంత ఉత్సాహం కలిగింది. రోజూ ఇక్కడికి వచ్చి మీకు నచ్చినంత సేపు కూర్చుని చదవుకోవచ్చని లైబ్రేరియన్ చెప్పారు. మా డాడీకి, లైబ్రేరియన్ మేడంకు మేము చాలా థ్యాంక్స్ చెప్పాం. నాన్న గారితో కలిసి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న రిసెప్షన్ వద్దకు వెళ్లాం. మా ఇద్దరికీ నాన్నగారు వన్ ఇయర్ మెంబర్‌షిప్ తీసుకున్నారు. రోజు క్రమం తప్పకుండా లైబ్రరీకి వచ్చి నచ్చిన కథలు, సైన్స్ పుస్తకాలు చదువుతూ గడిపేస్తున్నాం. ఫ్రెండ్స్ మీరు కూడా పౌరగ్రంథాలయానికి రండి. నచ్చిన కథల పుస్తకాలు చదివేయొచ్చు.



నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు



తెలుగు కథల పుస్తకాలు



ఇంగ్లీష్ కథల పుస్తకాలు

కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో సీడీపీవో రమణకుమారి, కిశోర టీం సభ్యులు, బాలికలు

మద్రిపాలెం: కిశోర బాలికల సాధికారత అందరూ బాధ్యతగా భావించాలని కిశోర టీం సభ్యులు పిలుపునిచ్చారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి మాట్లాడుతూ కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కౌమార బాలికలకు సాధికారపరచడం, వారిని స్వావలంబనగా ఉండటానికి ప్రేరేపించడం, చదువు, వృత్తిలో వారికి సహాయం చేయడం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించడం, వారిని బాధ్యతాయుమైన పౌరులుగా ఎదగడానికి ఈ వేసవి శిబిరం ఉపయోగపడుతుందన్నారు. బాలికలను భవిష్యత్తులోనూ సాధికారత దిశలో నడిపించడానికి అవగాహన అవసరమన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు సైతం కుమార్తెను చైతన్యం పరచడంలో దృష్టి సారించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కిశోర టీం కన్వీనర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, ఏఎన్‌ఎం స్రవంతి, ఆశ వర్కర్ వెంకటలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.



తారకరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంలో పాల్గొన్న బాలబాలికలు

కిశోర బాలికలకు అవగాహన

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు తారకరాంనగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ బి.కుమారి, ఎంఎస్‌కే లలిత, అంగన్‌వాడీ వర్కర్ ఎన్.పార్వతి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో బాలబాలికలు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు ప్రారంభం

తాటిచెట్లపాలెం: కిశోర వికాసం పేరిట కిశోర బాలికలకు వేసవి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయని ఐసీడీఎస్ మద్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జె.టి.ఎన్.జ్యోతి తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో జూన్ 10 వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. తొలి రోజు ముస్లిం తాటిచెట్లపాలెంతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల ఆధ్వర్యంలో బాలికల పరిచయాలు, లక్ష్యాల గురించి వివరించామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, నవీనహీరా, సచివాలయాల ఎంఎస్‌కే, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు , కిషోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ముస్లిం తాటిచెట్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు వేసవి శిక్షణ



కిశోరి వికాసంలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్త, తల్లులు

జూన్ 10 వరకు శిబిరాలు

సీతమ్మధార: వచ్చేనెల 10వ తేదీ వరకు జరిగే కిశోరి వికాసం వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త బి. గౌరి కోరారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిషోరి వికాసం పేరిట వేసవి శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌమార బాలికల సమస్యలు, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ మొదలైన అంశాలను వివరించారు. నెలరోజుల పాటు జరిగే ఈ వేసవి శిబిరం ద్వారా నేర్చుకున్న అంశాలు పిల్లల భవిష్యత్ జీవితంలో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన



మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని బర్మా క్యాంపు సమీపంలోని ఏఎస్ఆర్ నగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును తక్షణం తొలగించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు దుకాణం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం వీరు దుకాణం షట్టర్లు మూసివేయించారు. ఆస్పత్రి, కల్యాణ మండపం ఉన్న చోట మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల పౌరులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారని, మహిళలకు భద్రత కొరవడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో షాపు నిర్వహణకు ఎక్సైజ్ శాఖ అధికారులు లైసెన్సు ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. వారి లైసెన్సును తక్షణం రద్దు చేయాలని డిమాండు చేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం షాపు వల్ల కామాక్షినగర్, జైభారత్ నగర్, ఏఎస్సార్ నగర్, బర్మా క్యాంపు కాలనీ, పట్టాభిరెడ్డితోట నివాసితులకు ఇబ్బందులు వస్తాయని తెలిపారు. తక్షణం మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో కామాక్షినగర్, కాలనీ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కేవీ నాగేశ్వరరావు, పౌర చైతన్య వేదిక కార్యదర్శి సీహెచ్ ప్రమీల, కాలనీ మహిళలు శాంతి, రేణుక, సరస్వతి, ఈశ్వరరావు, ఇతర నాయకులు ఈశ్వరరావు, శంకరరావు, మహేష్ పాల్గొన్నారు. అనంతరం కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శంకరమఠం రోడ్డులో వ్యాన్ బీభత్సం



ముందుకు ఒరిగిపోయిన కంటైనర్ వ్యాన్ డ్రైవర్ క్యాబిన్

సీతంపేట: శంకరమఠం రోడ్డులో శుక్రవారం ఓ లారీ బీభత్సం సృష్టించడంతో వాహన చోదకులు భయాందోళనలకు గురయ్యారు. ఉదయం 11 గంటల సమయంలో హైవే నుంచి శంకరమఠం రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ కంటైనర్ వ్యాన్‌కు ముందు వెళ్తున్న వాహనాలు ఆగడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కంటైనర్ క్యాబిన్ ముందుకు ఒరిగిపోయింది. చాలా సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌ను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 8 గంటల తర్వాత భారీ వాహనాలకు నగరంలోకి అనుమతి లేనప్పటికీ ఇటువంటి కంటైనర్లను ఎలా అనుతిస్తున్నారని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌అండ్‌బీ స్థలంలో మళ్లీ ఆక్రమణలు





సీతమ్మధార ఆర్‌అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ దుకాణం

ఫాస్ట్‌ఫుడ్ దుకాణం పేరిట కబ్జా

సీతమ్మధార: స్థానిక రోడ్లు, భవనాల శాఖ(ఆర్‌అండ్‌బీ) కార్యాలయ సమీపంలో ఉన్న స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. సీతమ్మధారలోని ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో ఒక వ్యక్తి నిర్మించిన గుడిని కూల్చేసిన విషయం మరవక ముందే తాజాగా అక్కడే 'ఓజీ ఆన్ వీల్స్' పేరిట ఫాస్ట్‌ఫుడ్ దుకాణం ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడటం తీవ్ర దుమారం రేపుతోంది. ఇక్కడ తరచూ పలువురు వ్యక్తులు, వ్యాపారులు ఆక్రమణలకు పాల్పడుతున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది ప్రభుత్వ శాఖ స్థలమే అయినా సదరు వ్యక్తి ఇక్కడ దర్జాగా ఫాస్ట్‌ఫుడ్ పార్లర్ ఏర్పాటు చేయడం గమనార్హం. బయటి వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నా సరే.. పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

దర్జాగా ఫాస్ట్‌ఫుడ్ దుకాణం ఏర్పాటు

ఆర్‌అండ్‌బీ ఏఈ కార్యాలయానికి సమీపాన గల రెవెన్యూ ఉద్యోగి ఇంటి స్థలంలో కొందరు వ్యక్తులు దర్జాగా ఫాస్ట్‌ఫుడ్ దుకాణం నిర్వహిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆర్‌అండ్‌బీ క్వార్టర్లకు సమీపంలోని ఉద్యోగి ఇంటి ఆవరణలో ఓజీ ఆన్ వీల్స్ పేరిట 20 రోజుల కిందట దుకాణం ఏర్పాటు చేశారని స్థానికులు చెబుతున్నారు. సగం స్థలం క్వార్టర్ ఆవరణలోను, మరికొంత భాగం ఫుట్‌పాత్ మీద ఆక్రమించి మరీ దుకాణం పెట్టడం దుమారం రేపుతోంది. దీంతో ఇక్కడ పెద్ద సంఖ్యలో వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దుకాణాల రూపంలో ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా సరే ఇంజినీరింగ్ అధికారులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

దుకాణం తొలగిస్తాం

ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జూనియర్ ఇంజినీర్ ధనప్రియ వివరణ 'సాక్షి' కోరగా.. ఎస్ఈ జాన్ సుధాకర్ ఆదేశాల మేరకు సదరు దుకాణం వ్యాపారిని ఖాళీ చేసేయాలని ఆదేశించామని తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట నిర్బంధాన్ని తక్షణమే విరమించి, మావోయిస్టుల ఏరివేత పేరుతో ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ నేత ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయ్‌పూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులను అందంగా వేస్తున్నది ప్రజల కోసం కాదని, కార్పొరేట్ల కోసమే అన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల సంతోషం కోసం అమాయక గిరిజనులందరినీ అణచివేసి, ఖనిజ సంపదను దోచిపెట్టడానికి కుట్రలు పన్ను తున్నారన్నారు. అందుకనే కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు చేశారని, అలాగే మణిపూర్‌లో చిచ్చు పెట్టి.. ఇప్పుడు కర్రెగుట్టలో మొత్తం సైన్యాన్ని దించారని తెలిపారు. దర్నాలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఎం నేత మణి, డీఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, అరుణోదయ నిర్మల, న్యాయవాదులు కె.ఎస్.చలం, సురేష్, ఎంఎస్ఎస్ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.